క్లుప్తంగా

పేదలకు నిత్యవసరాల పంపిణీ



నిత్యవసరాలు అందచేస్తున్న సర్దార్‌బాష

ఒంగోలు అర్బన్: క్రిస్మస్ పండుగ నేపథ్యంలో సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ సెక్రటరీ షేక్ సర్దార్‌బాష ఆదివారం పేదలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఏసు క్రీస్తు సందేశమైన ప్రేమ, దయ, కరుణ, సేవ మార్గాలను ఎంచుకుని ట్రస్టు ద్వారా పేదలకు సేవలందిస్తున్నామన్నారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా నిరుపేదలకు దాతల సహకారంతో ఒక్కొరికి రూ.500 నంగదుతో పాటు బియ్యం, నిత్యవసర సరుకులు పది మందికి పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు వంగవీటి మోహన రంగా 35వ వర్ధంతి

ఒంగోలు: వంగవీటి మోహనరంగా 35వ వర్ధంతి సందర్భంగా స్థానిక రాంనగర్ మొదటి లైనులోని వంగవీటి మోహనరంగా విగ్రహానికి పుష్పమాలలు వేసి నివాళులర్పించనున్నట్లు జిల్లా కాపుసంఘం అధ్యక్షుడు కొక్కిరాల సంజీవ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రంగా అభిమానులు, కాపు ప్రముఖులు, కాపు సంఘ నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

మాజీ ప్రధాని వాజ్‌పేయికి ఘన నివాళి



వాజ్‌పేయికి నివాళులర్పించి మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఒంగోలు సెంట్రల్: మాజీ ప్రధానమంత్రి అటల్ బిహార్ వాజ్‌పేయి జయంతిని సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో ఘన నివాళి అర్పించారు. ఒంగోలు అసెంబ్లీ కన్వీనర్ వైసీ యోగయ్య యాదవ్ ఆధ్వర్యంలో మోడల్ టౌన్, హౌసింగ్ బోర్డు కాలనీ జంక్షన్ సొంత శక్తి కేంద్రంలో జెండా ఆవిష్కరించి అటల్‌జీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశానికి ఆయన సేసిన సేవలను, ఆయన గొప్పదనాన్ని వక్తలు కొనియాడారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ సెగ్గం శ్రీనివాసరావు, రెండో మండల అధ్యక్షుడు సంజీవ్‌కుమార్ యాదవ్, అజయ్, సీతారామయ్య, అనిల్, దామోదర్, రాధాక్రిష్ణ, టి. సత్యవతి, క్రిష్ణవేణి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు దత్త జయంతి

కనిగిరి రూరల్: స్థానిక షిర్డీ సాయిబాబా దేవస్థానంలో ఈనెల 26న మంగళవారం దత్త జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు దేవకి సుబ్రహ్మణ్యం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచే స్వామికి అభిషేకాలు, సామూహిక పూజలు జరుగుతాయన్నారు.

4న మండల సమావేశం

పామూరు: మండల సర్వసభ్య సమావేశం జనవరి 4న ఎంపీపీ గంగసాని లక్ష్మి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఊట్ల శ్రీనివాసులు తెలిపారు. సమావేశానికి జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, కోఆప్షన్ సభ్యుడు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరుకావాలన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని కోరారు.

దుస్తులు, చీరలు పంపిణీ

కనిగిరి రూరల్: క్రిస్మస్ సందర్భంగా ఎడవల్లి ఎంపీటీసీ వట్టి వేళ్ల రంగమ్మ, వైఎస్సార్ సీపీ నాయకుడు వట్టి వేళ్ల రంగబాబు మండలంలోని యర్రోబనపల్లి, కమ్మవారిపల్లికి చెందిన పాస్టర్లకు దుస్తులు, 60 మంది వృద్ధులకు సోమవారం చీరలు పంపిణీ చేశారు. మాజీ ఎంపీటీసీ జీవరత్నం, దేవాంగ సంక్షేమ సంఘం నాయకులు, స్థానిక పార్టీ నాయకులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో గంగమ్మ గుడి పునర్నిర్మాణం

పుల్లలచెరువు: దాతల సహకారంతో పుల్లలచెరువులోని చిన్నకండ్లేరు చెరువు వద్ద గంగమ్మదేవత గుడి పునర్నిర్మాణ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. పుల్లలచెరువు చిన్నకండ్లేరు చెరువు వద్ద పూర్వకాలంలో గంగమ్మగుడి నిర్మించారు. కాలక్రమంలో గుడి పాడుబడింది. దీంతో గ్రామస్తులు గుడి పునర్నిర్మాణానికి కంకణం కట్టుకున్నారు. దాతల సహకారంతో గుడి నిర్మించేందుకు పురోహితుల వేదమంత్రాల మధ్య శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దంపతులు పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కమిటీ సభ్యులు కె.రఘు, జి.గురునాథం, డిష్ చిన్నా, కె.కుమార్, యల్లయ్య, వాసు, పూర్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

లోక రక్షకుడు ఏసుక్రీస్తు



ఈతముక్కల్లో మేరీ మాత విగ్రహంతో ఉత్సవం



ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న మహిళలు



కరవదిలో దైవ సందేశం ఇస్తున్న పాస్టర్ ప్రభాకర్‌కుమార్

ఒంగోలు రూరల్: లోక రక్షణార్థం క్రీస్తు జన్మించారని గుంటూరు బైబిల్‌మిషన్ గవర్నింగ్ బాడీ మెంబర్, బైబిల్‌మిషన్ డ్రిస్టిక్ ఇన్‌చార్జి ఆర్.ఎం.ప్రభాకర్‌కుమార్ అన్నారు. క్రిస్మస్‌ను పురస్కరించుకొని కరవది బైబిల్ మిషన్ చర్చిలో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొని దైవ సందేశాన్ని అందించారు. తొలుత బైబిల్ మిషన్ గాయనీ క్రిస్మస్ గీతాలను ఆలపించగా బైబిల్ మిషన్ గాయకులు సహకరించారు. అనంతరం ప్రభాకర్, అవినాష్‌కుమార్‌లు దైవ సందేశాన్ని అందించారు. కరవది క్రిస్టీయన్‌పేట బేతేల్ ప్రార్థనా మందిరంలో నిర్వహించిన వేడుకల్లో మినిస్ట్రీస్ ఫౌండర్ జి.బేబిస్టార్ మాట్లాడుతూ బెత్లహేమ్ నగరంలో క్రీస్తు జన్మించారని, క్రీస్తు మీతో ఉండాలి అన్న భావన ఉండాలని అప్పుడే ప్రతి ఒక్కరి హృదయంలో క్రీస్తు జన్మించి ఆయన ఆలయంగా మారుతుందన్నారు. అలా మారాలంటే క్రీస్తు బోధనలు పాటించాలని సూచించారు. పాస్టర్ విక్టర్‌పాల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరి హృదయం పాపరహితంగా ఉండి క్రీస్తు రక్షణ కలిగి ఉండాలన్నారు. తొలుత బేతేల్ మినిస్ట్రీస్ గాయకులు క్రిస్మస్ గీతాలు ఆలపించారు. అనంతరం క్రిస్మస్ విందు ఏర్పాటు చేశారు. గుండాయపాలెంలో నాగేంద్రరావు, దేవరంపాడులో ఏ.శేఖర్‌బాబు, చేజర్లలో పాస్టర్ ఇశ్రాయేలు, త్రోవగుంటలో పాస్టర్ దాసుబాబు, కరవది బెత్లహేమ్ చర్చి, కరవది బీసీ కాలనీ, యేష్కోలు మందిరం, ముక్తినూతలపాడు త్రోవగుంట బాప్టిస్టు చర్చి, కరవది తూర్పు దళిత వాడ చర్చిల్లో క్రిస్మస్ ప్రార్థనలు నిర్వహించారు.

కొత్తపట్నం: క్రిస్మస్ పర్వదినాన్ని మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిల్లో ఆదివారం అర్ధరాత్రి నుంచే ప్రత్యేక ప్రార్థనలు ఏర్పాటు చేశారు. కొత్తపట్నం అరుంధతి కాలనీలోని యోహాన్ ప్రార్థనా మందిరం, కొత్తపట్నందళితవాడలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈతముక్కల రోమన్ కేథలిక్ చర్చి ఆధ్వర్యంలో మేరీ మాత ఉత్సవం నిర్వహించారు. కె.పల్లెపాలెంలో ది లివింగ్ ఇవాంజిలికల్ ఫెలోషిప్ ప్రార్థన మందిరంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎదుటివారికి సహాయ, సహకారాలు అందించడం వల్ల నిజమైన క్రిస్మస్ పండుగని ఆనందాన్ని పొందవచ్చన్నారు. అల్లూరులో సెవంత్ డే ప్రార్థన మందిరంలో, పాదర్తి, మోటుమాల, ఈతముక్కల, మడనూరు, సంకువాని గుంట ప్రార్థన మందిరాల్లో క్రిస్మస్ వేడుకలు, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చిన్న పిల్లలకు ఆటలు, బైబిల్ వ్యాస రచన పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈతముక్కలలో రోమన్ కేథలిక్ మిషనరి చర్చిల్లో సోమవారం సాయంత్రం మేరిమాత విగ్రహంతో గ్రామోత్సవం నిర్వహించారు. ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ బాలస్వామి, సంఘ కాపరి సుధాకర్ ఆధ్వర్యంలో ఉత్సవం ఘనంగా నిర్వహించారు. కాలనీ నుంచి అంబేడ్కర్ విగ్రహం, వైఎస్సార్ విగ్రహం మీదుగా ఉత్సవం సాగింది.

నేటి నుంచి రాచర్ల గేటు మూత

గిద్దలూరు రూరల్: పట్టణంలోని రాచర్ల గేటును సోమవారం నుంచి 28వ తేదీ వరకు మూతవేస్తున్నట్లు పీడబ్ల్యూఐ శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు గుంతకల్ డబ్లింగ్ రైల్వే పనుల్లో భాగంగా రాచర్ల గేటు 3 రోజుల పాటుగా మూత వేస్తున్నామన్నారు. రాచర్ల మండలం నుంచి వచ్చే వారు రాచర్ల గేటు నుంచి పాములపల్లె గేటు వరకు లింకు రోడ్డును ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు. పెద్ద వాహనాలు సత్యవోలు నుంచి వెళ్లాల్సిందిగా ఆయన కోరారు.

కాశీనాయనకు పూజలు

పెద్దారవీడు: మండల పరిధిలోని దేవరాజుగట్టు గ్రామ సమీపంలో వెలసిన శ్రీ కాశీనాయన ఆశ్రమంలో 28వ ఆరాధన మహోత్సవం సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు బీవీ దత్తయ్య ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, పూజలు, పట్టువస్త్రాలు, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం కోలాటం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం మధ్యాహ్నం కోలాటం, రాత్రి శ్రీభక్త చింతామణి పూర్తి నాటకం ప్రదర్శన ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు.

డాక్టర్ ఎంవీఎల్ సేవలు అభినందనీయం



ఆర్థిక సాయం అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి



పేదలకు కుట్టు మిషన్లు అందిస్తున్న డాక్టర్ బీ జవహర్, బదరీనారాయణ

- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి

చీమకుర్తి: చీమకుర్తి కంటి డాక్టర్‌గా జిల్లావ్యాప్తంగా పేరొందిన డాక్టర్ ఎంవీఎల్ నరసింహరావు పేదలకు అందించిన వైద్యసేవలు అభినందనీయమని జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి అన్నారు. సోమవారం చీమకుర్తిలోని జవహర్ ఆస్పత్రి ప్రాంగణంలో నిర్వహించిన డాక్టర్ ఎంవీఎల్ నరసింహరావు జయంతి కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ డాక్టర్ ఎంవీఎల్ జయంతిని పురస్కరించుకుని ప్రతి ఏటా డాక్టర్ బీ జవహర్ చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. అనంతరం లయన్స్‌క్లబ్ వారి సహకారంతో ఇంటిని నిర్మించుకుంటున్న పేద వ్యక్తికి బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి చేతుల మీదుగా రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. ముగ్గురు పేద మహిళలకు కుట్టుమిషన్లు, విద్యార్థికి ల్యాప్‌టాప్, పలు ప్రభుత్వ పాఠశాలలకు మౌలిక వసతుల కల్పనకు ఆర్థిక సాయంను లయన్స్‌క్లబ్ ద్వారా అందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ వ్యవస్థాపకులు డాక్టర్ బీ జవహర్, గెలాక్సీ గ్రానైట్ యజమాని చలువాది బదరీనారాయణ, మున్సిపల్ చైర్‌పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాసరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ చల్లా అంకులు, లయన్స్‌క్లబ్ నాయకులు నూనె సుబ్రహ్మణ్యం, నూనె హేమసుందర్, చలువాది రమేష్, పాటిబండ్ల గంగయ్య, గోపురపు చంద్ర, పాటిబండ్ల రాజసులోచన, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన అవసరం

పామూరు: ప్రభుత్వ పథకాలపై ప్రజలు అవగాహన కలిసి పథకాలను ఉపయోగించుకుని అభివృద్ధి చెందాలని ఎంపీడీఓ ఊట్ల శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ గంధం యేసురత్నం అన్నారు. మండలంలోని దూబగుంట్ల, నర్రమారెళ్ల గ్రామ పంచాయతీల పరిధిలో సోమవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర సర్పంచ్‌లు కందుల శ్రీకాంత్‌రెడ్డి, గంధం సుధారాణిల అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా ఆధునిక వ్యవసాయ పద్ధతులు, వ్యవసాయంలో డ్రోన్ వినియోగం, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న 17 రకాల సంక్షేమ, అభివృద్ధి పథకాలు వివరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ కేఎల్.శ్రీనివాసరావు, ఏఓ కంచం రాధ, డాక్టర్ రుబీనా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోళ్ల రాజ్యలక్ష్మి, పార్వతి, పీఎస్ ఆదాంబీ, బీజేపీ నియోజకవర్గ అధ్యక్షుడు కొండిశెట్టి వెంకట రమణయ్య పాల్గొన్నారు.

నూరుశాతం ఫలితాలు సాధించాలి



దాతలు అందజేసిన టెస్ట్ పేపర్స్‌తో విద్యార్థులు, ఎస్‌ఓ

సీఎస్‌పురం(పామూరు): పదో తరగతి విద్యార్థులు నూరుశాతం ఫలితాలు సాధించి ప్రభుత్వ పాఠశాలల సత్తా చాటాలని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు జవంగుల వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి షేక్.పాదుషా అన్నారు. స్థానిక కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయంలో విద్యాలయం ఎస్‌వో షేక్.రేష్మ అధ్యక్షతన సోమవారం జరిగిన కార్యక్రమంలో యూటీఎఫ్ మండలశాఖ ఆధ్వర్యంలో విద్యాలయంలోని 34 మంది విద్యార్థులకు దాత పాలుగుళ్ల లక్ష్మి సమకూర్చిన టెస్ట్ పేపర్స్‌ను ఎస్‌ఓ రేష్మ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని, దాతల చేయూతను సైతం ఉపయోగించుకుని మెరుగైన ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో కె.వెంకటేశ్వర్లు, పఠాన్ నాయబ్‌రసూల్, ఇర్ల కొండయ్య, ఎన్ వెంకట్రామయ్య పాల్గొన్నారు.

వీక్షిత్ భారత్ సంకల్పయాత్ర ప్రారంభం



ఇనమనమెళ్లూరులో మోదీ ఫొటోతో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, అధికారులు, నాయకులు



నందిపాడులో పొలాలకు పురుగు మందులు పిచికారీ చేస్తున్న డ్రోన్‌ను పరిశీలిస్తున్న మండల అధికారులు

- హాజరైన ఎంపీపీ అరుణ, అధికారులు

మద్దిపాడు: వీక్షిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని సోమవారం మద్దిపాడు మండలంలో ప్రారంభించారు. ఇనమనమెళ్లూరు, నందిపాడు గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహించగా, ఇనమనమెళ్లూరులో ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ప్రధాని మోదీ ఫొటోతో ఉన్న 2024 క్యాలెండర్‌ను ఎంపీపీ చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం సమకూర్చుతున్న ఆర్థిక వనరులు తమ శాఖల ద్వారా ఏ విధంగా ప్రజలకు ప్రయోజనం చేకూరుస్తున్నాయో అధికారులు వివరించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలకు ఏ విధంగా మేలు చేకూర్చుతుందనే విషయాలను ఆ పార్టీ మండల అధ్యక్షుడు చెన్నుపల్లి రమణ వివరించారు. పొలాల్లో పురుగుమందులు డ్రోన్ ద్వారా పిచికారీ చేసే విధానంపై డెమో చూపారు. దానికి ఇస్తున్న సబ్సిడీ, తదితర విషయాలను వివరించారు. మెడికల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డ్వాక్రా మహిళలు తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తూ ఒక స్టాల్ ఏర్పాటు చేశారు. ప్రకృతి వ్యవసాయం చేసేందుకు వాడే కషాయాలు తయారు చేస్తూ మరో స్టాల్ ఏర్పాటు చేశారు. సభకు వచ్చిన వారు, అధికారులు స్టాల్స్‌ను సందర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ రజనీకుమారి, మండల కార్యాలయ అధికారి సుబ్బారావు, ఏఓ రమేష్, ఏపీఓ ధనుంజయ, ఏపీఎం నరేంద్ర, గ్రామ సర్పంచ్ ఏకుల ఏడుకొండలు, వైఎస్సార్ సీపీ నాయకులు ఆకుల శ్రీను, గద్దె జాలయ్య, నైనాల శ్రీనివాసరావు, అంజయ్య, వైద్యశాఖ సిబ్బంది, డ్వాక్రా గ్రూపుల మహిళలు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు దుప్పట్లు, చీరలు పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న సమితి సభ్యులు

కందుకూరు: పట్టణంలోని ఉప్పుచెరువులో గల జీవనజ్యోతి దివ్యాంగ వికాస సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రిస్మస్ కేక్ కట్ చేయడంతో పాటు, పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ రఫీ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అలాగే గోనుగుంట వెంకటేశ్వర్లు (తిమోతి) దుప్పట్లు అందజేశారు. క్రైస్తవ పర్వదినాన దివ్యాంగులకు సేవా కార్యక్రమాలు చేపట్టడం ఆనందంగా ఉందని, సమాజంలో నిరాదారణకు గురైన వారికి అండగా ఉండడం ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. దివ్యాంగ సేవా సమితి ప్రెసిడెంట్ చనమాల శ్రీనివాసరావు, ప్రధానకార్యదర్శి శీలం వెంకటేష్, కోశాధికారి నూకతోటి హరిబాబు, పాస్టర్ సామ్యేలురాజు, విశ్వ, మైత్రేష్, నితీష్, చరణ్‌తేజ, శ్రీహరి, నూనె శ్రీను, ఆర్‌ఎంపీ డాక్టర్ రాజేంద్రప్రసాద్, దళిత నాయకుడు డిసిహెచ్ మాలకొండయ్య పాల్గొన్నారు.

మనుస్మృతికి వ్యతిరేకంగా నిరసనలు



పేర్నమిట్టలో మనుస్మృతి పేపర్లను దహనం చేస్తున్న అంబేడ్కర్ స్మృతివనం సభ్యులు



చీమకుర్తిలో మనుస్మృతి పేపర్లను దహనం చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

చీమకుర్తి: నిమ్నజాతులను అణగదొక్కడానికి కారణమైన మనుస్మృతిని అంబేడ్కర్ స్మృతివనం, కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఆయా సంఘాల నాయకులు సోమవారం దహనం చేశారు. పేర్నమిట్టలోని అంబేడ్కర్ స్మృతివనం అధ్యక్షుడు, సభ్యుడు నూకతోటి రామారావు, నూకతోటి రవికుమార్ ఆధ్వర్యంలో మనుస్మృతి పేపర్లను అంబేడ్కర్ విగ్రహం వద్ద దహనం చేసి నిరసనలు తెలిపారు. చీమకుర్తిలోని పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద కేవీపీఎస్ నాయకులు ఆరెతోటి రాంబాబు, గంటినపల్లి పోతురాజు, ఎంఆర్పీఎస్ నాయకుడు బక్కా రాజు ఆధ్వర్యంలో మనుస్మృతి పత్రాలను దహనం చేశారు. 1927 డిసెంబర్ 25న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మహద్ గ్రామంలోని చెరువు వద్ద నిమ్నజాతులను అవమానాలకు గురిచేస్తూ అణగదొక్కబడుతున్న మనుధర్మశాస్త్ర గ్రంథం మనుస్మృతిని దహనం చేసిన రోజును పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

మద్దిపాడులో ఘనంగా క్రిస్మస్ వేడుకలు



మద్దిపాడు విలియం కేరీ చర్చిలో దేవుని వాక్యం వినిపిస్తున్న పాస్టర్

మద్దిపాడు: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న చర్చిల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాస్టర్లు దేవుని వాక్యాలు చదివి ప్రజలు ఎలా జీవించాలనే విషయాలను తెలిపారు. క్రిస్టియన్‌గా ఉన్న వారు పాటించాల్సిన నియమాలను వివరించారు. క్రీస్తు పుట్టిన విధానం, ముందుగా దేవదూతలు వచ్చి క్రీస్తుకు స్వాగతం పలకడం వంటి ఘటనలు, సారాంశం తెలుపుతూ ప్రార్థనలు చేశారు. క్రిస్మస్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కొన్ని చర్చిలలో ప్రార్థనల అనంతరం భోజనాలు ఏర్పాటు చేశారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

టంగుటూరు: విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిన సంఘటన మండలంలోని కొణిజేడు గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. బాధితుడు ఈదా సుబ్బారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తాను గేదెను మేపుతుండగా గ్రామంలోని కుమ్మరి గొంది వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తీగ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. ఈ మేరకు బాధితుడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నేడు ఆడుదాం–ఆంధ్రా పోటీలు ప్రారంభం



పీసీపల్లి జెడ్పీహెచ్ఎస్ క్రీడా ప్రాంగణం

సింగరాయకొండ: మండలంలోని 15 గ్రామ సచివాలయాల పరిధిలో మంగళవారం ఆడుదాం–ఆంధ్రా కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీఓ షేక్ జమీఉల్లా తెలిపారు. కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో కబడ్డీ పోటీలు నిర్వహిస్తామన్నారు. ప్రారంభోత్సవ ర్యాలీల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు, క్రీడాకారులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

కొండపి(సింగరాయకొండ): కొండపి మండలంలోని 14 గ్రామ సచివాలయాల పరిధిలో మంగళవారం ఆడుదాం–ఆంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రమణమూర్తి తెలిపారు. ఉదయం 9.30 గంటలకు కొండపి జెడ్పీ హైస్కూల్ నుంచి 200 మీటర్ల జాతీయ జెండాతో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, క్రీడాకారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పోటీలకు సర్వం సిద్ధం

పీసీపల్లి: ప్రభుత్వం మంగళవారం నుంచి నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్ర పోటీలకు సర్వం సిద్ధమయ్యాయి. మండలంలోని అన్ని గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు సిద్ధం చేశారు. ఈ మేరకు 13 సచివాలయాల పరిధిలో ఇప్పటికే క్రీడాకారులు సమోదు చేశారు. పలు విభాగాల్లో దరఖాస్తు చేసుకున్న క్రీడాకారులకు ఆయా సచివాలయాల్లో పోటీలు నిర్వహిస్తారు. పోటీల్లో పాల్గొన్న వారికి మండల, నియోకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఎంపిక చేసి విజేతలుగా నిర్ణయిస్తారు.

రాధాకృష్ణ మందిరంలో ప్రత్యేక పూజలు

చీరాల అర్బన్: పట్టణంలోని పాపరాజుతోటలోని రాధాకృష్ణమందిరంలో సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. రోహిణి నక్షత్రం సందర్భంగా సీతారామాంజనేయ షణ్ముఖ మహిళా సమాజం ఆధ్వర్యంలో భగవద్గీత 18 అధ్యాయాలు పారాయణ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అలంకరణలు నిర్వహించారు. అనంతరం 30 మంది బీద నారాయణులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో రాధాకృష్ణ మందిర కమిటీ సభ్యులు నల్లూరి బ్రహ్మం, కె.రమేష్, కె.శంకరరావు, ప్రతాప్ సాయిబాబు, వలివేటి రాంబాబు, గుగ్గిలం గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

త్రిపురాంతకేశ్వరాలయంలో అభిషేకాలు



త్రిపురాంతకేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

త్రిపురాంతకం: స్థానిక శ్రీపార్వతీ సమేత త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయంలో సోమవారం అభిషేకాలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అర్చకుడు విశ్వనారాయణశాస్త్రి పూజలు జరిపించారు. ఆలయాల ఈఓ చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.